నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I హైదరాబాద్, శనివారం 19 ఏప్రిల్ 2025 VIKARABAD


## నేడు ముఖ్యనేతలతో సమావేశం



తెలంగాణ భవన్‌లో శనివారం ఉదయం 10:30 గంటలకు గ్రేటర్ బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సమావేశాన్ని నిర్వహిస్తారని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. సభ విజయవంతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు, ఇతర ముఖ్యనాయకులు సమావేశంలో పాల్గొంటారని తలసాని వివరించారు.

## పార్టీ పండుగను అంబరాన్నంటేలా నిర్వహించుకుందాం..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

- వరంగల్ మహాసభకు భారీగా వెళ్దాం
- కార్యకర్తలు, నాయకులతో కలిసి చలో వరంగల్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ
- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, ఏప్రిల్ 18 : ఈ నెల 27న వరంగల్‌లో జరిగే మహాసభకు దండులా తరలివెళ్లి సక్సెస్ చేద్దామని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. శుక్రవారం బీఆర్ఎస్ నాయకుడు మధుసూదన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ పండుగను అంబరాన్నంటేలా ఘనంగా నిర్వహించుకుందామన్నారు. అందుకోసం నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలాల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలన్నారు. పోరాడి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్.. పదేండ్ల కాలంలో తెలంగాణను ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. ఆయన పాలనలో అన్ని వర్గాల వారు సంతోషంగా ఉన్నారన్నారు. వరంగల్ సభకు తరలివెళ్లేందుకు 15 బస్సులు, 150 ప్రైవేట్ వాహనాలు, బీఆర్ఎస్ శ్రేణుల సొంత వాహనాలు అందుబాటులో ఉంటాయన్నారు. అనంతరం ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి చలో వరంగల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రావు యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేశ్‌బాబు, కోట్ల యాదగిరి, నారాయణరెడ్డి, చాంద్‌పాషా, బాల్‌రాజ్, నర్మదా కిష్టప్ప, అబ్దుల్ వాహబ్, ముక్తార్, నవాజొద్దిన్, లగచర్ల సురేశ్, భీములు, దత్తురెడ్డి, రాములు, శ్రీనివాస్, కవిత పాల్గొన్నారు.

# ఇంటికో జెండా.. ఊరికో బండితో భారీగా తరలివెళ్దాం

## రజతోత్సవాన్ని విజయవంతం చేద్దాం

- బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో నియోజకవర్గ సమన్వయ కమిటీ మీటింగ్
- హాజరైన రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, ఇతర నేతలు
- మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవిపై ధ్యాసే తప్పా..ప్రజలను పట్టించుకునే సోయిలేదని ఆగ్రహం



బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, చిత్రంలో రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్

రంగారెడ్డి, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ)/ఇబ్రహీంపట్నం : వరంగల్‌లో ఈనెల 27న జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి ఇంటికో జెండా.. ఊరికో బండి తో భారీగా తరలివెళ్లి విజయవంతం చేద్దామని పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మె ల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని శేరిగూడ సీకే కన్వెన్షన్ హాల్‌లో జరిగిన పార్టీ రజతోత్సవ మహాసభ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రజతోత్సవాన్ని పండుగలా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు, ప్రజలు, అభిమానులు భారీగా తరలిరావాలన్నారు. అలవి కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను మోసం చేస్తున్నదని మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీలను అధోగతి పాలు చేసిందన్నారు.

### మంత్రి పదవి రాకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తావా..?

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవిపై ధ్యాసే తప్పా.. ప్రజలు, నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకునే సోయిలేదని..మంత్రి పదవి రాకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని గాలి మాటలు చెప్పడం కాదు.. దమ్ముంటే రాజీనామా చేయాలని మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. మంత్రి పదవి కోసం ఆయన ఢిల్లీ చుట్టూ తిరుగుతూ 16 నెలలుగా ప్రజా సమస్యలు గాలికి వదిలేశారని మండిపడ్డారు. నియోజకవర్గంలో గత బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులే తప్పా.. కాంగ్రెస్ హయాంలో ఒక్క రూపాయి కూడా విడుదల చేసి అభివృద్ధి పనులు చేపట్టలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి తీసుకురాలేని మల్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవటం నియోజకవర్గ ప్రజల దురదృష్టమన్నారు. ఎన్నికల ముందు కోట్లాది రూపాయల ప్రొసీడింగ్‌లను బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పనుల కోసం విడుదల చేస్తే అవి ఈ ఎమ్మెల్యే నిర్లక్ష్యంతో వెనక్కి వెళ్లిపోతున్నాయన్నారు. 16 నెలల్లో ఎప్పుడూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షు డు వంగేటి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దండెం రాంరెడ్డి, జక్క రాం రెడ్డి, ఏర్పుల చంద్రయ్య, కృపేశ్, బలరాం, ఆకుల యాదగిరి, బియ్యని జ్ఞానేశ్వర్, అల్వాల వెంకట్‌రెడ్డి, కొప్పు జంగయ్య, పాశం దామోదర్, కల్యాణ్‌నాయక్, బుగ్గ రాములు, రమేశ్‌గౌడ్, కిషన్‌గౌడ్, రమేశ్, రంగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, యాదయ్య, వెంకట్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, భరత్‌కుమార్, భరత్‌రెడ్డి, జెర్కోని రాజు, జగదీష్, శివసాయి, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


### 16 నెలలుగా అభివృద్ధి కుంటుపడింది..



ఇబ్రహీంపట్నం నియోజకవర్గం గత 15 ఏండ్లుగా అభివృద్ధిలో ముందున్నది. 16 నెలల కిందట ఈ ప్రాంతం ఓ వ్యక్తి చేతిలోకి వెళ్లిందో అప్పటి నుంచి అభివృద్ధిలో వెనుకబడింది. ఈ ప్రాంత అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడు. 16 నెలలుగా ఇబ్రహీంపట్నం ప్రాంతంలో ఏ ఒక్క అభివృద్ధికీ రూపాయి కేటాయించకుండా...తట్టెడు మట్టి పోయకుండా పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నాడు.

-క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

## పూర్వవైభవం తీసుకొద్దాం..



సమావేశంలో మాట్లాడుతున్న పీ కార్తీక్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 18 : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరుగనున్న రజతోత్సవ సభను సక్సెస్ చేసేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం అత్తాపూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణను రూపొందించి ప్రణాళికతో ముందుకు సాగాలని గులాబీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చి రానున్న ఎన్నికల్లో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వచ్చేలా కష్టపడి పని చేయాలన్నారు.

## ట్యాంకర్ నీరే దిక్కు..

వికారాబాద్, ఏప్రిల్ 18 : గత రెండు రోజులుగా తాగునీరు సక్రమంగా రాకపోవడంతో శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని రామయ్యగూడ ఎంఐజీ కాలనీవాసులు ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకుని అవసరాలు తీర్చుకున్నారు. ఒక్కో ట్యాంకర్‌ను రూ. వెయ్యి చెల్లించాల్సి వస్తున్నదని అధికారులు స్పందించి నీటి ఎద్దడిని తొలగించాలని కోరుతున్నారు.





కొత్లాపూర్‌లో గాలివానకు నేలకొరిగిన అరటి చెట్లు

## దంచి కొట్టింది

- వికారాబాద్ జిల్లాలో భారీ వర్షం
- దెబ్బతిన్న పంటలు
- నేలకొరిగిన బొప్పాయి, అరటి చెట్లు

వికారాబాద్ జిల్లాలో శుక్రవారం సాయంత్రం వర్షం దంచి కొట్టింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి పండ్ల తోటలు, కూరగాయలు, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయి. తాండూరు మండలంలోని అంతారంలో ఇల్లు కూలింది. అదే విధంగా వికారాబాద్ నుంచి ఎర్రవల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై మూడు చెట్లు విరిగి పడ్డాయి. దీంతో వికారాబాద్ నుంచి మోమిన్‌పేట, సదాశివపేట వెళ్లే వాహనదారులు ఇబ్బందిపడ్డారు.

మర్పల్లి, ఏప్రిల్ 18 : మండలంలోని కొత్లాపూర్, సిరిపురం, వీర్లపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షానికి పండ్ల తోటలు, కూరగాయలు, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయి. కొత్లాపూర్ గ్రామానికి చెందిన ఈడిగి వెంకటేశంగౌడ్ నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకుని రెండెకరాల్లో అరటి, మరో రెండెకరాల్లో బొప్పాయి పంటను సాగు చేయగా.. శుక్రవారం కురిసిన వర్షానికి అరటి, బొప్పాయి పంటలు పూర్తిగా నేలకొరిగాయి. కొద్ది రోజుల్లో పంటలు కోతకు వచ్చేవని, అప్పులు చేసి వాటిని సాగు చేశానని.. సుమారు రూ.4 లక్షల నష్టం జరిగిందని బాధితుడు వెంకటేశం తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

### నేలకొరిగిన చెట్లు..

యాలాల : మండలంలో గాలివాన బీభత్సంతో చెట్లు నేలకొరిగాయి. కొంతమేర పంటలకు నష్టం వాటిల్లింది. మధ్యాహ్నం వేడితో ఇబ్బంది పడ్డ ప్రజలు సాయంత్రం వాన కురిసి చల్లబడడంతో ఊపిరి పీల్చుకున్నారు.

### అంతారంలో కూలిన ఇల్లు

తాండూరు రూరల్ : తాండూరు మండలంలోని అంతారంలో ఈదురుగాలులకు డప్పు రాజుకు చెందిన ఇంటి రేకులు ఎగిరిపోయాయి. అదేవిధంగా ఎల్మకన్నె గ్రామంలో ఈదురుగాలులకు చెట్లు రోడ్డుపై విరిగిపడ్డాయి. దాంతోపాటు గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు స్పందించి వెంటనే సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

### రోడ్డుపై పడ్డ చెట్లు

వికారాబాద్ : ఈదురు గాలులు బలంగా వీయడంతో వికారాబాద్ నుంచి ఎర్రవల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై మూడు చెట్లు విరిగి పడ్డాయి. దీంతో వికారాబాద్ నుంచి మోమిన్‌పేట, సదాశివపేట వెళ్లే వాహనదారులు, పాదచారులు ఇబ్బందిపడ్డారు. ఈదురు గాలులకు ట్రాక్టర్‌పై వెళ్తున్న కొత్తగడికి చెందిన ఇద్దరు వ్యక్తులపై చెట్టు పడడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. గాయపడ్డ వారిని వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్ దవాఖానకు వెళ్లి పరామర్శించారు. అనంతరం రోడ్డుపై విరిగి పడ్డ చెట్లను వికారాబాద్ సీఐ భీమ్‌కుమార్, నవాబుపేట ఎస్ఐ అరుణ్‌కుమార్‌గౌడ్, స్థానికులు మూడు జేసీబీలతో తొలగించారు.



తాండూరు రూరల్ : గాలివానకు ఎగిరి కింద పడ్డ ఇంటి పైన ఉన్న రేకులు

### చేతికొచ్చిన పంట నేలపాలు

పెద్దేముల్ : మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన వర్షానికి చేతికొచ్చిన వరి పంట నేలపాలైంది. ఇన్ని రోజులు నీళ్లు లేక ఇబ్బంది పడగా.. ఇప్పుడు వడగళ్ల వర్షానికి పంట నేల పాలు కావడంతో అన్నదాతలు దిక్కుతోచనిస్థితిలో ఉన్నారు. వడగళ్ల వర్షానికి నష్టపోయిన రైతులను ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు.



వికారాబాద్ : ఈదురు గాలికి రోడ్డుపై విరిగి పడ్డ చెట్లు

## వరుస చోరీలతో బెంబేలు

- తాళం వేసిన ఇండ్లలో చోరీలు
- ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే దొంగతనాలు
- ఏప్రిల్ 7న ఒకే రోజు రెండు ఇండ్లలో చోరీలు.. మరుసటి రోజు మరో ఇంట్లో..
- వరుస చోరీలతో భయాందోళనలో మణికంఠనగర్‌వాసులు
- చోరీల నియంత్రణకు విడతల వారీగా గస్తీ కాస్తున్న స్థానికులు
- ఉదయం డ్యూటీలు చేస్తూ.. రాత్రి సమయంలో కాపలాగా ఉంటూ..
- పోలీసులు గస్తీ పెంచాలంటున్న స్థానికులు

### 14 తులాల బంగారం పోయింది..



మా చెల్లి వివాహం కోసం 14 తులాల బంగారాన్ని దాచి పెట్టా. ఏప్రిల్ 7న పుట్టింటికెళ్లి మరుసటి రోజు ఇంటికొచ్చి చూసే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికెళ్లి చూడగా బీరువాలో ఉన్న 14 తులాల బంగారం కనిపించ లేదు. ఇంటికి తాళం వేస్తే దొంగలు రెచ్చిపోతున్నారు. రాత్రి సమయంలో నిద్రించాలంటేనే భయంగా ఉన్నది. పోలీసులు గస్తీ పెంచి చోరీలు జరుగకుండా చూడాలి.

-భవాని, మణికంఠనగర్, వికారాబాద్



రాత్రి సమయంలో గస్తీ కాస్తున్న మణికంఠనగర్ కాలనీవాసులు

వికారాబాద్, ఏప్రిల్ 18 : వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలోని కాలనీలో వరుసగా చోరీలు జరుగుతుండడంతో స్థానికులు విడతల వారీగా గస్తీ నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొన్నది. వికారాబాద్ పట్టణంలోని పలు కాలనీల్లో చోరీలు జరుగుతుండడం పోలీసులకు సవాల్‌గా మారింది. తాళం వేసిన ఇండ్లు, జన సాంద్రత లేని ప్రాంతాలు, విద్యుత్ సరఫరా లేని ప్రదేశాలు, రైలు పట్టాల సమీపంలో ఉన్న శివారు ప్రాంతాలను దొంగలు దోచేస్తున్నారు. పట్టణంలోని ఆలంపల్లి (ఎంఐజీ) రాఘవేంద్రస్వామి కాలనీలో చెడ్డీ గ్యాంగ్ చోరీలకు పాల్పడుతున్నది. గత నెల రోజుల్లో 10 కిపైగా చోరీలు జరుగగా బంగారం, వెండి, నగదు తస్కరణకు గురైంది. పట్టణంలోని మణికంఠనగర్ కాలనీ రైలు పట్టాలకు సమీపంలో ఉండడంతోపాటు కాలనీలో వీధిదీపాలు వెలగక పోవడంతో చోరీలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఏప్రిల్ 7న ఒకే రోజు రెండు ఇండ్లలో చోరీలు జరుగగా దొంగలు బంగారం, వెండి, డబ్బును ఎత్తుకెళ్లారు. అదేవిధంగా మరుసటి రోజు మరో ఇంట్లో దొంగలు పడడంతో కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రి సమయంలో నిద్రించాలంటేనే భయంగా ఉందని పేర్కొంటున్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్నా..పదికి పైగా పోలీసుల ఇండ్లు ఉన్నా తమ కాలనీలో చోరీలు జరుగుతున్నాయని పలువురు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిరాణా షాపులో సెల్‌ఫోన్ చోరీ జరగడంతోపాటు ఇంటి ముందు నిలిపిన బైకుల నుంచి పెట్రోల్‌ను తస్కరిస్తున్నారని.. పోలీసులు సక్రమంగా గస్తీ నిర్వహించకపోవడంతోనే తమ కాలనీలో చోరీలు జరుగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. దొంగతనాలను నివారించేందుకు గత పదిరోజులుగా విడతల వారీగా కాలనీవాసులం గస్తీ కాస్తున్నామని పేర్కొంటున్నారు. రాత్రి 11 గంటల వరకు మహిళలు ఇంటి బయట కాపాలాగా ఉంటుండగా.. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ డ్యూటీలు చేసి వచ్చిన పురుషులు రాత్రి 11 గంటల నుంచి తెల్లవారు జాము 4 గంటల వరకు కర్రలు పట్టుకొని కాలనీలో తిరుగుతూ గస్తీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి తమ కాలనీలోని స్తంభాలకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



ఆలంపల్లి రాఘవేంద్రస్వామి కాలనీలో చెడ్డీ గ్యాంగ్ తిరిగిన సీసీ ఫుటేజ్(ఫైల్)

### తిరుపతికెళ్లిన రోజు దొంగలు పడ్డారు..



బావమరిది కుమార్తె తలానీలను సమర్పించేందుకు ఈనెల 7న తిరుపతికి కుటుంబంతో కలిసి వెళ్లా. మరుసటి రోజు మా కాలనీ నుంచి ఫోన్ వచ్చింది. మీ ఇంట్లో దొంగలు పడ్డారని.. ఇంటికి వెళ్లి చూడగా తాళం, బీరువాను దొంగలు పగులగొట్టి.. 8 తులాల బంగారం, 6 తులాల వెండి, రూ.40,000 దొంగలు ఎత్తుకెళ్లారు. చోరీలను అరికట్టేందుకు పోలీసులు గస్తీని పెంచాలి.

-యాదయ్య మణికంఠ నగర్ కాలనీ, వికారాబాద్

### పగలు డ్యూటీ.. రాత్రి గస్తీ..



తమ కాలనీలో దాదాపు 40 ఇండ్లు ఉంటాయి. కలెక్టరేట్‌కు, ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉంటుంది. దాదాపుగా 90 శాతం ఉద్యోగులే ఉన్నారు. అందులో పదివరకు పోలీసు కుటుంబాలే ఉన్నాయి. రాత్రి సమయంలో నిద్రించాలంటే భయంగా ఉన్నది. దొంగలు వస్తారేమో అనే భయంతో ప్రతిరోజూ రాత్రి సమయంలో విడతల వారీగా గస్తీ నిర్వహిస్తున్నాం. ఉదయం డ్యూటీలు చేస్తూ.. రాత్రిళ్లు గస్తీ నిర్వహిస్తుండడంతో నిద్రలేక చాలా ఇబ్బంది పడుతున్నాం.

-రవీందర్‌గౌడ్, మణికంఠనగర్, వికారాబాద్

### వీధి దీపాలు వెలగకపోవడంతోనే..



తమ కాలనీ రైలు పట్టాలకు సమీపంలో ఉండడంతోపాటు పలు చోట్ల వీధి దీపాలు వెలగకపోవడంతో దొంగతనాలకు అనువుగా మారింది. కాలనీలో నిత్యం చోరీలు జరుగుతుండడంతో భయం భయంగా బతుకుతున్నాం. పోలీసులు సక్రమంగా గస్తీ నిర్వహించకపోవడంతో కాలనీవాసులందరం విడతల వారీగా రాత్రి సమయంలో కర్రలు పట్టుకొని గస్తీ నిర్వహిస్తున్నాం. అనుమానస్పద వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకుంటున్నాం. కాలనీలో పోలీసులు గస్తీ పెంచితే బాగుంటుంది.

-సత్యం, మణికంఠనగర్, వికారాబాద్